

మల్లన్న ఆలయంలో నేడు హుండీ లెక్కింపు

చేర్యాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో గురువారం కానుకలు, ఒడిబియ్యం హుండీ లెక్కింపులు చేపట్టనున్నట్లు ఈవో రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకోగా, హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు.

పతంగులు ఎగురవేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి రామ్‌మందిర్ భజన మండలి కార్యకర్తల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు



పతంగి ఎగురవేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంగళవారం కార్యకర్తలతో కలిసి వేడుకలను అట్టహాసంగా జరుపున్నారు. పట్టణంలోని రామ్‌మందిర్ వద్ద గాలిపటాలను ఎగురవేస్తూ ఉల్లాసంగా గడిపారు.



సంగారెడ్డిలో పతంగి ఎగురవేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సిద్దిపేట పట్టణంలో

మంచుదుప్పటి

జిల్లాను మంచుదుప్పటి కప్పేసింది. రాజీవ్ రహదారి, జిల్లాలోని ప్రధాన రోడ్లపైన పొగమంచు కమ్ముకున్నది. పండుగ వేళ ఉదయం పలు పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని నడిపారు.

- సిద్దిపేట కల్చరల్/చేర్యాల(ఆంధ్రజ్యోతి)



చేర్యాలలోని జనగామ-సిద్దిపేట రోడ్డుపై

సంబరాల సంక్రాంతి



అక్కన్నపేట మండలం జనగామలో ఎడ్లబండ్ల ఊరేగింపు







సిద్దిపేట పట్టణంలో ఆవుపేడ పిడకల మంటపై పొంగిస్తున్న పాలు

మకర సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. వేకువజాము నుంచే అందమైన రంగవల్లులను ముంగిట్లో వేసి మహిళలు మురిసిపోయారు. ముగ్గులపై గొబ్బెమ్మలు పేర్చి, నవధాన్యాలను వేసి అలంకరించారు. కొన్నిచోట్ల ఆవు పిడకలను అంటించి చిన్న ముంతలో పాలను పొంగించారు. ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. వంటింట్లో ప్రత్యేకమైన వంటకాలు ఘుమఘుమలాడాయి. విన్యాసాలు చేస్తూ డూడూ బసవన్నలు ముంగిళ్ల ముందుకు వచ్చాయి. హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపును ఘనంగా నిర్వహించగా, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. బుధవారం కనుమ రోజున రైతులు పశువులను కడిగి అందంగా అలంకరించారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి సిరిసంపదలు కలగాలని వేడుకున్నారు.

మూడురోజులుగా ఏ మైదానం చూసినా, ఏ బిల్డింగ్‌పై చూసిన యువతీయువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగరవేస్తూ సరదాగా గడిపారు. పలుచోట్ల పాటలు హోరెత్తగా, ఉత్సాహంగా కేరింతలు వేశారు.

- సిద్దిపేట కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి)



హుస్నాబాద్‌లో ఆభరణాల ఊరేగింపులో తలపై అయ్యప్పస్వామి వారిని మోస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేటలో ఎగురవేసిన పతంగి

నర్సాపూర్ పట్టణంలోని ఓ బిల్డింగ్‌పై ఉత్సాహంగా గాలిపటాలను ఎగురవేస్తున్న యువకులు





కొమురవెల్లిలోని గోకులంలో కృష్ణుడి విగ్రహం

మల్లన్నా.. గో సేవ భాగ్యమేదన్నా..!

గోకులం నిర్వహణలో నిర్లక్ష్యం

తోటబావి వెళ్లే మార్గంలో ఏర్పాటు

పర్యవేక్షణ లేక నిరుపయోగం

రాజగోపుర ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్

7

గ్యాంగ్ రేప్ ఘటనలో ముగ్గురి అరెస్ట్

మొరాలకించేదెవరు?

రేకులకుంట మల్లన్న ఆలయాభివృద్ధికి అటవీశాఖ కొర్రీలు

నట్టడివిలో సౌకర్యాలు లేక భక్తుల అవస్థలు

దుబ్బాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక శివారులోని మల్లన్నగుట్టలోని మల్లికార్జున, రేణుకాదేవి ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తాయి. ఆలయానికి కైకంర్యం తప్పా యోగక్షేమాలు చూసే వారేలేరు. ఓపక్క అటవీశాఖ కొర్రీలు, మరోవైపు దేవదాయశాఖ అధికారులు, పూజారుల నిలువుదోపిడీతో ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. భక్తులే దాతలుగా వసతులు కల్పిస్తామంటే, అటవీశాఖ అధికారుల తీరుతో సాగడం లేదు. ఏడాది పొడవునా ప్రతీ శుక్ర, ఆదివారం, మంగళవారం ఇక్కడకు వచ్చే భక్తులు ఇబ్బందుల మధ్యే మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇటీవల పూజారుల మధ్య గొడవ, అటవీశాఖ అధికారుల నోటీసులతో ఆలయం చుట్టూ వివాదం నెలకొన్నది.



అటవీశాఖ అధికారులు కూల్చిన దుకాణసముదాయాలు

రోడ్డు విస్తరణ చేయనివ్వలే

మల్లన్నగుట్టలు అటవీప్రాంతం రిజర్వ్‌ఫారెస్ట్ కిందికి వస్తుంది. ఆలయం మాత్రం మూడున్నర ఎకరాల విస్తీర్ణం దేవాదాయశాఖ పరిధిలోని దుబ్బాక రెవెన్యూ శివారులో ఉంది. చుట్టూ అటవీశాఖ కంపార్ట్‌మెంటు నంబరు 225లో ఉంటుంది. ఇందులో దేవాలయ రహదారి కూడా వస్తుందని రోడ్డు విస్తరణ జరగనివ్వలేదు. అంతేగాక మిషన్ భగీరథ పైపులైన్‌ను వేయనివ్వలేదు. దాతలు ముందుకు వచ్చి, నిర్మించిన సత్రాలను 2019లో అటవీశాఖ ధ్వంసం చేసింది. ఇక్కడ తాత్కాలిక దుకాణ సముదాయాలను తొలగించారు. ఇక్కడి మరుగుదొడ్లు, స్నానపు గదులకు తాళాలు వేశారు. ప్రస్తుతం కరెంటు సరఫరాను కూడా కట్‌చేశారు. దీంతో భక్తులు ఇక్కడ రాత్రి విడిది చేయాలంటే నరకం చూస్తున్నారు. బిక్కుబిక్కుమంటూ మల్లన్నకు పట్నాలు వేసి, మొక్కులు తీర్చుకునే పరిస్థితి దాపురించింది.

ఇంత నిర్లక్ష్యమా?

ఆలయానికి ఒక హెక్టార్ స్థలాన్ని అటవీశాఖ నుంచి కేటాయించాలని కొన్నేళ్లుగా కేంద్ర అటవీశాఖ అధికారులకు స్థానికులు విన్నవిస్తూనే ఉన్నారు. అందుకు అవసరమైన ఐదు ఎకరాల భూమిని అటవీప్రాంతాన్ని ఆనుకుని కొనుగోలు చేసి ఇస్తామని కూడా ప్రతిపాదన పంపారు. భక్తులు సుమారు రూ.70 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అటవీశాఖ నిర్లక్ష్యం మూలంగా మల్లన్నకు అవస్థలు తప్పడంలేదు.



అటవీ ప్రాంతంలోని రేకులకుంట మల్లన్న ఆలయం

డీఎఫ్‌వో సందర్శన

ఏడాది పొడవునా సాగే జాతర శుక్రవారం ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా అటవీశాఖ అధికారి (ఇన్‌చార్జి) జ్యోజీ రేకులకుంట ఆలయాన్ని సందర్శించారు. హెక్టార్ భూమిని ఆలయానికి అందించడాప్రతిపాదనలు పంపారని, అనుమతి వచ్చే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు.

కోస్టాట్ యాప్‌తో రూ. కోట్లు హాంఫట్!

- నట్టేట ముంచడంతో లబోదిబోమంటున్న బాధితులు

చేర్యాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అత్యాశకుపోయి ఓ మొబైల్ యాప్ ద్వారా కోట్లాది రూపాయల మేర డబ్బు పోగొట్టుకున్నారు. ఫ్రూట్, ఐస్‌క్రీమ్, తదితరాల ఐడీ ఆఫర్ పేరిట ఆకర్షించిన యాప్ నిర్వాహకులు తీరా బిచాణా ఎత్తేసి కుచ్చుటోపీ పెట్టడంతో లబోదిబోమని మొత్తుకుంటున్నారు. బయటకు చెప్పుకోలేక, పోలీసులకు ఫిర్యాదు చేయలేక ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన పలువురు కోట్లాది రూపాయలు కోల్పోయిన సంఘటన కలకలం రేపుతుంది. వివరాలిలా ఉన్నాయి. కోస్టాట్ యాప్ లింక్ ఓపెన్ చేసి ఐడీ క్రియేట్ చేసుకున్న అనంతరం ఐస్‌క్రీమ్‌లు, ఇతర వస్తువుల ధరలు సూచించాయి. ఒక్కో ఫ్లేవర్ ఐస్‌క్రీమ్‌కు ఒక్కో ధరను ప్రదర్శించి నిర్ణీత సమయంలో కొంటే యాభైశాతం ఆఫర్ వర్తిస్తుందని, ఎవరు ఎంత మొత్తం డబ్బు చెల్లిస్తే ప్రతీరోజు అంతమేర డబ్బులు 14రోజుల పాటు జమచేస్తామని నమ్మబలికారు. ఐస్‌క్రీమ్ ధర రూ.56వేలు ఉంటే 50శాతం ఆఫర్‌గా రూ.28వేలు చెల్లిస్తే రూ.84వేలు చొప్పున 14రోజుల పాటు రూ.11.76 లక్షలు పొందుతారని సూచించారు. దీంతో బంపర్ ఆఫర్‌కు ఆకర్షితులైన పేద, మధ్యతరగతితో పాటు ఉన్నత కుటుంబాలు, చిరు వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒక్కో వ్యక్తి మరొకరికి ఈ విషయాన్ని వ్యాప్తి చేశారు. వ్యక్తిగతంగా, తమ కుటుంబసభ్యుల పేరిట రకరకాల ఐడీలు ఎంపిక చేసుకుని తక్కువకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. దీంతో రెండు, మూడురోజుల పాటు రోజు వారీ డబ్బు జమ చేస్తున్నామని యాప్‌లో సూచించినప్పటికీ రోజులు గడిచినా ఎంతకీ జమకాకపోవడం, తీరా యాప్ ఓపెన్ కాకపోవడంతో మోసపోయినట్లు నిర్ధారించుకున్నారు. బాధితులు ఎక్కువగా చేర్యాల పట్టణంతోపాటు, మండలంలోని ఆకునూరు, కాశీగుడిశెలు, రాంపూర్, ముస్త్యాల, మద్దూరు మండలంలోని వల్లంపట్ల, గాగిళ్లాపూర్ తదితరగ్రామాలకు చెందినవారు ఉన్నట్లు తెలిసింది. చేర్యాల పట్టణంలో సుమారు రూ.3కోట్లు, ఆకునూరు, కాశీగుడిశెలు రెండు గ్రామాల్లోనే సుమారు రూ.4కోట్ల మేర మోసపోయినట్టుగా ప్రచారం జరుగుతుంది. బయటకు చెప్పుకోవడానికి ఎవరూ సాహసించకపోగా చెబితే ఏమవుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. కాగా ఆయా ఐడీలు క్రియేట్ చేసినందుకు పెట్టుబడిలో 10శాతం కమీషన్ పొందడంతో పలువురు ఏజెంట్ల అవతారం ఎత్తి కార్లు, బైక్‌లు పొందామని నమ్మిస్తూ ఎవరిని పడితే వారిని చేర్పించి తమ వ్యక్తిగత స్వార్థానికి బలిచేశారు. రోజు వారీ డబ్బు జమ కావడం లేదన్న విషయాన్ని తమను చేర్పించిన వారిని అడిగితే తామేం చేయలేమని చేతులెత్తేయడంతో దిక్కుతోచని



యాప్‌లో ఐస్‌క్రీం, ఫ్రూట్ ఐడీ ధరలు

అర్హులకు పథకాలు అందేలా కార్యాచరణ

- వీడియోకాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట కలెక్టరేట్/ సిద్దిపేట టౌన్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా కార్యాచరణను రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 26 జనవరి నాటికి 75 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు నిర్ణయించిందని ఆమె తెలిపారు. ఢిల్లీలో ఉన్న మంత్రి బుధవారం ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూభారతి పోర్టల్‌లో నమోదైన పట్టాదారులు మాత్రమే రైతు భరోసాకు అర్హులని కలెక్టర్లకు స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే అందేలా చూడాలన్నారు. జిల్లా, మండలస్థాయిలో అమలుకు నోడల్ ఆఫీసర్ల సేవల వినియోగించుకోవాలని సూచించారు. భూములకు సంబంధించి రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు కుటుంబాన్ని యూనిట్ తీసుకుంటున్నట్లు తెలిపారు. భూమి లేని కూలీలకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ కింద కనీసం 20 రోజులు పనిచేసిన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ కమిటీలతో సంప్రదించి లబ్ధిదారులు ఎంపిక పూర్తి పారదర్శకతతో జరిగేలా చూడాలన్నారు. ఒక వ్యక్తికి ఒకే చోట రేషన్ కార్డు వుండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నూతన పథకాల అమలుకు సంబంధించి మండలస్థాయిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి, తనను చేర్చాలని, దీంతో పథకాల అమలు తీరును తెలుసుకోవడానికి అవకాశముంటుందని చెప్పారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

రైతు కూలీలందరికీ 'భరోసా' ఇవ్వాలి : హరీశ్

రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్క సెంటు భూమి ఉన్నా రాదని చెప్పడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 24,57,000 మంది అని తెలిపారు. ఇలాంటి రైతులకు రైతు భరోసా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు ప్రకటించాలన్నారు. గతంలో గ్రామసభలు పెట్టి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసేదని గుర్తుచేశారు. సమీక్షలో ఉమ్మడి మెదక్ జిల్లా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉమ్మడి మెదక్ జిల్లా నోడల్ ఆఫీసర్ హరిచందన, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.







ధర్మ పరిరక్షణ కోసం ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం కృషి

● మెదక్ విభాగ్ కార్యవాహ బోలా నాగభూషణం


పెద్దశంకరంపేట శిశుమందిర్‌లో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు

పెద్దశంకరంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణ కోసం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) నిరంతరం కృషి చేస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ కార్యవాహ బోలా నాగభూషణం అన్నారు. పెద్దశంకరంపేటలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతిలో పాల్గొని మాట్లాడారు. మన జీవన విధానంలో ప్రకృతికి అనుగుణంగా పండుగలు జరుపుకుంటున్నామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి సందర్భంగా గతి విదులు పేరుతో కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరసత, పర్యావరణం, ధర్మజాగరణ, గ్రామీణ వికాస్, పౌర హక్కుల ద్వారా చేస్తున్న పనులను స్వయం సేవకులు అందరికీ వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధు, జిల్లా పర్యావరణ ప్రముఖ్ రవివర్మ, మాజీ ఎంపీటీసీ సుభాష్‌గౌడ్, కందుకూరి రవీందర్, మల్లేశం, దస్వంత్, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ బాధ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


మంతూరి రామమ్మ(ఫైల్)

వట్‌పల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృదురాలు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. వట్‌పల్లి మండలం కేరూర్ గ్రామానికి చెందిన మంతూరి రామమ్మ(61) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 14న ఇంట్లో బాత్‌రూమ్‌కు వెళ్లి క్లీనింగ్ యాసిడ్ తాగి అపస్మారకస్థితికి చేరుకున్నది. గమనించిన ఆమె భర్త బీరప్ప హుటాహుటిన జోగిపేట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు శివరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్ తెలిపారు.

ప్రమాదవశాత్తు కంటైనర్ బోల్తా

చిన్నశంకరంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కంటైనర్ బోల్తాపడిన సంఘటన చిన్నశంకరంపేట శివారులోని ఇండియన్ పెట్రోల్ బంకు సమీపం వద్ద మెదక్-చేగుంట రహదారిపై బుధవారం సాయంత్రం చోటు చేసుకున్నది. మెదక్ నుంచి చేగుంటకు వెళ్తున్న కంటైనర్ మరో వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాలేదని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

మాజీ సర్పంచ్‌పై దాడి, వ్యక్తిపై కేసు

నిజాంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పంట కౌలు డబ్బుల విషయమై మాజీ సర్పంచ్‌పై దాడి జరిగింది. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పొలాన్ని చల్మెడ గ్రామానికి చెందిన బొమ్మ చిన్ననారాయణ కౌలుకు చేస్తున్నాడు. పొలానికి పెట్టుబడి పెట్టిన నారాయణ.. పంట అమ్మిన తర్వాత వచ్చిన డబ్బుల విషయమై శ్రీనివాస్‌రెడ్డిని అడిగాడు. ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవడంతో కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై స్థానిక పెట్రోల్ బంకు వద్దకు రాగానే నారాయణ అతడిని చితకబాదగా.. తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎ్‌స్ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

చోరీకి పాల్పడిన ఐదుగురికి రిమాండ్

చిన్నశంకరంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : చోరీకి పాల్పడిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. మండల కేంద్రం శివారులో హర్షిక స్టీల్, ట్యూబ్ కంపెనీ నిర్మాణం కోసం ఇనుప గేర్ రాడ్లను ఒక రూమ్‌లో దాచి ఉంచారు. అయితే ఆరురోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన అంబి రమేష్, ముద్రాతి రాంచంద్రం, అంబి సురేష్, చాకలి నాగరాజు, చాకలి బాబు అర్ధరాత్రి ప్రహరీని కూలగొట్టి ఇనుప గేర్ రాడ్లను దొంగలించారు. దొంగలించిన రాడ్లను శివారులో డప్పు లింగం వ్యవసాయ పొలం వద్ద దాచి ఉంచారు. దాచిన రాడ్లను అమ్మేందుకు వెళ్లే సమయంలో ఎస్ నారాయణగౌడ్ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

బార్‌పై తల్వార్‌తో దాడి

తూప్రాన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బార్ మూసేసిన తరువాత వెళ్లి బీర్ల కోసం గొడవ పెట్టుకున్నారు. బీర్ల విషయంలో గొడవచేసి వాచ్‌మన్‌పై దాడిచేసి తల్వార్‌తో భయాందోళనకు గురిచేశారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణ శివారులోని బార్‌లో చోటు చేసుకుంది. తూప్రాన్ పోలీసుల వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ బైపాస్‌లో ఉన్న బార్‌లో పట్టణానికి చెందిన సంతోష్‌సింగ్ మరికొందరు మంగళవారం సాయంత్రం మద్యం సేవించారు. బిల్లు చెల్లింపు విషయంలో గొడవ జరిగింది. బయటకు వెళ్లిపోయిన సంతోష్‌సింగ్ అర్ధరాత్రి తరువాత మరో ఇద్దరితో కలిసి బార్‌కు వచ్చాడు. తల్వార్‌తో హల్‌చల్ చేసి సూపర్‌వైజర్ రాహుల్‌గౌడ్‌పై తల్వార్‌తో దాడిచేయబోగా.. అతను తృటిలో తప్పించుకున్నాడు. భయాందోళనకు గురైన బార్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గెలుపోటములు సహజం: ఎస్ఐ


విజేతలకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

రేగోడు/అల్లాదుర్గం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్ఐ పోచయ్య అన్నారు. టి లింగంపల్లి మాజీ సర్పంచ్ బగిలి అనుమప్ప స్మారకార్థం రెండురోజుల పాటు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో టి లింగంపల్లి బసవరాజు టీం ప్రథమస్థానంలో, సింధోల్ రవి టీం ద్వితీయస్థానంలో నిలిచింది. మంగళవారం రాత్రి విజేతలకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బగిలి శ్రీనివాస్, విజయ్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు. అల్లాదుర్గం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఓటమి విజయానికి నాంది అని అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామంలో బోయిన జనార్దన్, కోర్మేని ప్రభు, పీ.వీరప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను బుధవారం ఎస్ఐ ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలానికి చెందిన 10 జట్లు పాల్గొన్నాయి.

అంతర్జాతీయ సదస్సులో సిద్దిపేట యువతి

సిద్దిపేట కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కర్నూలులో నాలుగు రోజులపాటు జరిగిన ఇంటర్నేషనల్ సౌత్ ఏషియన్ పీస్ కాన్ఫరెన్స్‌లో సిద్దిపేటకు చెందిన మూర్తి శ్రీహితరెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్ నిజాం కళాశాలలో ఎంఏ(ఇంగ్లిష్) సెకండ్ ఇయర్ చదువుతున్న శ్రీహితతో కలిపి 19 మంది తెలంగాణ రాష్ట్రం నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రాముఖ్యత గురించిన ప్రసంగం, తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు, కళా నైపుణ్యాలు ప్రదర్శించినందుకు గానూ ప్రశంసలు అందుకున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో భూటాన్, నేపాల్, శ్రీలంక, అఫ్ఘానిస్తాన్‌తో పాటు పలు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



కత్తులు, తల్వార్లతో వీరంగం వేస్తున్న యువకులు

పతంగుల కొనుగోలు వద్ద గొడవ

కత్తులు, తల్వార్లతో వీరంగం

తూప్రాన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పతంగుల మాంజా కొనుగోలు విషయంలో జరిగిన చిన్నపాటి గొడవ దాడులకు దారి తీసింది. దాడులు పెరిగిపోయి తల్వార్లు, కత్తులతో వీరంగం వేశారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన గణేశ్ పతంగులు విక్రయిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పతంగులు కొనుగోలు చేసేందుకు కొందరు యువకులు వచ్చారు. మాంజా కొనుగోలు విషయంలో గొడవ జరిగింది. దాంతో యువకులు తమ కుటుంబసభ్యులను తీసుకుని అక్కడికి వచ్చారు. వారు రావడం.. రావడంతోనే కత్తులు, తల్వార్లు దూస్తూ హల్‌చల్ చేశారు. ఇళ్లలోకి చొరబడి భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి జగదీశ్ సింగ్, రామ్‌సింగ్, అమర్‌దీప్ సింగ్‌లతో పాటు మరికొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అలాగే, పతంగుల దుకాణం యాజమాని గణేష్‌తో పాటు మరి కొందరిపై కూడా కేసు నమోదు చేశారు.

ఆటో చోరీ చేసి.. కారును ఢీకొట్టి..



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

తూప్రాన్/ శివ్వంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన ఆటోను చోరీ చేసి.. దానిని తీసుకెళ్తూ ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు.. ఆటోతో పాటు నిందితుడూ గాయపడ్డాడు. ఆటో చోరీ తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకోగా, ప్రమాదం శివ్వంపేట మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ (అగ్రహారం) గ్రామానికి చెందిన మానుక లింగం మంగళవారం తన ఆటో (ఏపీ 23 ఎక్స్ 3297)లో తూప్రాన్ పట్టణానికి వచ్చాడు. హైస్కూల్ వద్ద ఆటో పార్క్ చేసి కూరగాయల మార్కెట్ లోపలికి వెళ్లాడు. గంట తర్వాత వచ్చి చూడగా, ఆటో కనిపించలేదు. ఈ మేరకు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, ఆటోను సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీరంగూడకు చెందిన శివశంకర్ చోరీ చేసి తీసుకెళ్తున్నాడు. నిందితుడు మార్గమధ్యంలో శివ్వంపేట మండలం చండీ శివారులో తూప్రాన్-సంగారెడ్డి రహదారిలో ఎదురుగా వస్తున్న ఉసిరికపల్లి గ్రామానికి చెందిన సిరివేరి అంజనేయులు కారును ఢీకొట్టారు. ఈ సంఘటనలో కారు పూర్తిగా ధ్వంసం కాగా, నిందితుడు శివశంకర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. శివ్వంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

మనోహరాబాద్ జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్‌కు చెందిన గుర్రం శ్రీనివాస్ (38)కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. అప్పుడప్పుడు మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. మూడు రోజుల క్రితమూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె తన ఇద్దరు పిల్లలను తీసుకుని గజ్వేల్‌లోని తల్లిగారింటికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం మద్యం తాగి వచ్చి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన అతని తమ్ముడు.. ఇరుగుపొరుగు సాయంతో కిందికి దించగా, అప్పటికే చనిపోయి ఉన్నాడు. భార్య రమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కబడ్డీ కోర్టులో అంత్యక్రియలు

కబడ్డీ కోర్టు వేసి.. అంత్యక్రియలు

అక్కన్నపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పులికాశి సంపత్ అంత్యక్రియలు గ్రామస్థులు వినూత్నరీతిలో నిర్వహించారు. కబడ్డీ క్రీడాకారుడు అయిన పులికాశి సంపత్ హుస్నాబాద్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. బుధవారం ఆయన స్వగ్రామమైన అక్కన్నపేట మండలం చౌటపల్లిలో కబడ్డీ క్రీడాకారులు కబడ్డీ కోర్టు వేసి, దానిని పూలతో నింపి అంత్యక్రియలు నిర్వహించారు. సీనియర్ కబడ్డీ క్రీడాకారుడైన పులికాశి సంపత్ చౌటపల్లి గ్రామంలో చాలామంది యువకులను ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు పంపించారు. ఆయన ఆధ్వర్యంలో జాతీయ కబడ్డీ క్రీడాకారుడుగా గంగాధరి మల్లేష్ రాణిస్తూ ప్రస్తుతం ప్రో కబడ్డీలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు.

మల్లన్నా.. గో సేవ భాగ్యమేదన్నా..!



నిరుపయోగంగా ఉన్న గోకులం

గోకులం నిర్వహణలో నిర్లక్ష్యం- తోటబావి వెళ్లే మార్గంలో ఏర్పాటు

పర్యవేక్షణ లేక నిరుపయోగం- రాజగోపుర ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్

చేర్యాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు గోసేవ చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ఇక్కడ గోకులం ఉన్నప్పటికీ ఆలయ వర్గాల నిర్లక్ష్యం కారణంగా భక్తులు గోమాతను సేవించుకునే భాగ్యం కలగడం లేదు. ఏటా మూడు నెలల పాటు ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. సాధారణ రోజుల్లోనూ మల్లన్న ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటు

దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గతంలో ప్రముఖ ఆలయాల ప్రాంగణాల్లో గోకులాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలోనూ సుమారు ఎనిమిదేళ్ల క్రితం గోకులాన్ని ఏర్పాటు చేశారు. కొమురవెల్లికి చెందిన కాపర్తి కృష్ణమూర్తి సుమారు రూ. 5 లలు వెచ్చించి గోకులాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. అయితే, అప్పటి అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల నిష్ప్రయోజనం అయింది. భక్తులకు అనువైన రాజగోపుర ప్రాంగణంలో కాకుండా తోటబావికి వెళ్లే మార్గంలో చిన్న ప్రదేశంలో గోకులం ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత దాని నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో పలువురు గోకులం గోడలపై దుస్తులు ఆరబెట్టుకునేందుకు, వస్తు సామగ్రి నిల్వ చేసేందుకు వినియోగిస్తున్నారు. దీంతో గోశాల అపవిత్రం అవుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పాలక మండలిలో చర్చిస్తాం

గోకులాన్ని రాజగోపుర ఆవరణలోకి మార్చాలనే డిమాండ్ వస్తోంది. ఈ విషయాన్ని పాలకమండలి సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రతి శుక్రవారం గోమాత పూజతో పాటు ఇతర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

-రామాంజనేయులు, ఈవో, కొమురవెల్లి

కోడెలు పక్కదారి

మల్లన్నను దర్శించుకునే భక్తుల్లో కొందరు తమ పాడి పంటలు చల్లగా చూడాలని, తమ కోర్కెలు నెరవేర్చాలని స్వామి వారిని వేడుకుంటూ కోడెలు, ఆవులు, మేకలు, గొర్రెలను మొక్కుబడులుగా అందిస్తుంటారు. అయితే, కొంత మంది ఆలయ ఉద్యోగులు, సిబ్బంది వీటిని పక్కదారి పట్టించినా.. అలా వెళ్తా పట్టుపడిన సంఘటనలూ ఉన్నాయి. అంతేకాకుండా ఆలయంలో భక్తులు సమర్పించిన కోడెలు, ఆవులు, మేకలు, గొర్రెలను వేలం వేయడం, వాటిని కొనుగోలు చేసి కబేళాకు తరలించడం వంటి ఘటనలు స్థానికంగా దుమారాన్ని రేపాయి. దీంతో అప్పటి కలెక్టర్ వెంకట్రామారెడ్డి వేలాన్ని నిలిపి వేయించారు. దీంతో అప్పటి నుంచి కోడెలు, ఆవులను గోశాలకు పంపుతున్నారు. గోశాల నిర్వహణ సరిగ్గా లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గోశాలను రాజగోపుర ఆవరణలోని విశాల ప్రాంతానికి మార్చాలని భక్తులు కోరుతున్నారు.

చిరు ధాన్యాల సాగుకు అడ్రస్‌గా డీడీఎస్

పాతపంటల జాతర ప్రారంభం





రైతులను సన్మానిస్తున్న అతిథులు, జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు

జహీరాబాద్, జనవరి 15: జీవ వైవిధ్యాన్ని కాపాడితేనే లాభసాటి వ్యవసాయానికి ఆస్కారం ఉంటుందని ఐసీఏఆర్ అటారీ పదో జోన్ డైరెకర్ డాక్టర్ షేక్ ఎస్ మీరా అన్నారు. న్యాల్‌కల్ మండలంలోని వడ్డీ గ్రామంలో మంగళవారం డీడీఎస్ (డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో పాత పంటల(జాతర) పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో డీడీఎస్ ఆధ్వర్యంలో సాగుచేస్తున్న చిరు ధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉన్నాయని, ఆరోగ్య.. ఆహార భద్రతలను అందించేందుకు డీడీఎస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంస్థ కార్యకలాపాలు 70 గ్రామాల్లో, 5 వేల పైచిలుకు మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడి పాతపంటలను కాపాడటం అభినందనీయమన్నారు. రైతులు సమష్టిగా సాగు చేస్తున్న చిరుధాన్యాలకు బ్రాండింగ్ అవసరమని, అందుకు తాము సహకరిస్తామన్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు కేవీకే, సీఎస్ఆర్ సహాయంతో పంటనూర్పిడి యంత్రాలు అందజేస్తామన్నారు. డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య మాట్లాడుతూ డీడీఎస్ మహిళా రైతులు అనుకున్నది సాధిస్తారనే ధీమా ఉందన్నారు. డీడీఎస్ జాయింట్ డైరెక్టర్, హైకోర్టు న్యాయవాది రవికుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రసాద్‌రావు, హత్నూర్ సీఐ హన్మంతు, డీడీఎస్ సభ్యురాలు సలోమి, రైతు స్వరాజ్ వేదిక సామాజిక కార్యకర్త ఉషాసీతామహాలక్ష్మి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్యాంగ్ రేప్ ఘటనలో ముగ్గురి అరెస్ట్

మాసాయిపేట. జనవరి 15, (ఆంధ్రజ్యోతి) మండలం రామంతాపూర్ గ్రామంలో మతిస్థిమితం లేని మహిళను గ్యాంగ్ రేప్ చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న ఉదయం 4.30 నిమిషాల ప్రాంతంలో రామంతాపూర్ హంస దాబా పక్కన నిద్రిస్తోన్న మతిస్థిమితం లేని మహిళపై సయ్యద్ అఫ్రోజ్, మహ్మద్ సాహిల్, గౌర బసవరాజ్ అనే ముగ్గురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన చేగుంట ఎస్ఐ చైతన్యకుమారెడ్డి, పోలీసులను సీఐ అభినందించారు.

ఒకే ఫ్లెక్సీలో కేసీఆర్, పవన్

సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఏర్పాటు



జనగామ గ్రామంలో ఏర్పాటు చేసిన కేసీఆర్, పవన్ కల్యాణ్ ఫొటోలతో ఫ్లెక్సీ

అక్కన్నపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోటోలు ముద్రించి సంక్రాంతి, మహాశివరాత్రి, ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ కొందరు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సంక్రాంతి సందర్భంగా అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన తాటిపల్లి వెంకటరెడ్డి, వొద్దమల్ల ప్రశాంత్ అనే అభిమానులు గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఇద్దరి ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రాజకీయాల్లో కేసీఆర్ అంటే అభిమానమని, సినిమా హీరోగా పవన్ కల్యాణ్ అభిమానమని ఈ సందర్భంగా వారు తెలిపారు.


కొత్తకొండ జాతర చూసొద్దాం



కొత్తకొండ జాతరకు ప్రదర్శనగా బయలుదేరిన ఎడ్లబండ్లు

అక్కన్నపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు మండలంలోని జనగామ గ్రామం నుంచి ఎడ్లబండ్లు బయలుదేరి వెళ్లాయి. ఈ గ్రామానికి చెందిన కొత్తకొండ అనే వ్యక్తిని వీరభద్రస్వామి ప్రతిరూపంగా భావించి కానుకలు చెల్లిస్తారు. ఆయన ఏటా సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడానికి ముందు నెల రోజుల పాటు ఉపవాసం చేస్తారు. సంక్రాంతి పండుగకు గ్రామస్థులంతా ఎడ్లబండ్లు కట్టుకుని జాతరకు వెళ్లారు. భక్తులు సమర్పించిన కానుకలను కరెన్సీ నోట్ల రూపంలో మాలగా మార్చి కొత్తకొండ జాతరకు వెళ్లారు.

ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు జలాలు



పుల్‌కల్/ పాపన్నపేట/ కొల్చారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌కు ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు సింగూరు ప్రాజెక్టు నుంచి 0.35 టీఎంసీల జలాలను మొదటి విడతగా విడుదల చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యాసంగి సీజన్‌లో ఘనపురం ఆయకట్టు కింద 21,625 ఎకరాలు సాగు అవుతోంది. రైతులకు అవసరమైన జలాలను సింగూరు ప్రాజెక్టు నుంచి బుధవారం విడుదల చేశారు. ప్రాజెక్టుకు దిగువన ఉన్న మంజీర రిజర్వాయర్‌కు ముందుగా జలాలను విడుదల చేయనున్నారు. ప్రాజెక్టుకు ఎడమ వైపున నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలో 7.5 మెగావాట్ల సామర్థ్యం గల రెండు టర్బైన్ల ద్వారా 0.35 టీఎంసీల జలాలను విడుదల చేశారు. జెన్‌కో ద్వారా అవుట్ ఫ్లో 2,842 క్యూసెక్కుల నీటి దిగువకు విడుదలవుతున్నాయి. 0.35 టీఎంసీల జలాల విడుదల పూర్తి కాగానే జల విద్యుత్ గేట్ల ద్వారా నీటి విడుదలను నిలిపివేస్తామని ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈఈ మహిపాల్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వరకు నీరు ఘనపురం ప్రాజెక్టును చేరుతుందని, పశువుల కాపరులు, మత్స్యకారులు మంజీర నదిలోకి వెళ్లొద్దని అధికారులు సూచించారు.

పంట కాలువల కోసం రైతుల ధర్నా



దుబ్బాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ నుంచి వచ్చే మల్లాయపల్లి, కమ్మర్‌పల్లి, అచ్చుమాయిపల్లి, పెద్దచీకోడు, ఆరెపల్లి, పోతారం, గంబీర్‌పూర్ చెరువులను నింపే కాలువల పనులు పూర్తిచేయాలంటూ బుధవారం దుబ్బాక మండల రైతాంగం ఆందోళన చేపట్టింది. పెద్దచీకోడు తాజా మాజీ ఎంపీటీసీ ఎల్. రాంరెడ్డి ఆధ్వర్యంలో 4ఎఫ్ కాలువ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ దుబ్బాక- ముస్తాబాద్ రహదారిపై బైఠాయించారు. 14 కిలోమీటర్ల కాలువలను చేపట్టి, అసంపూర్తిగా వదిలేశారని, దీనివల్ల సుమారు 15 చెరువులకు నీళ్లందించే అవకాశం ఉందన్నారు. యాసంగికి సాగునీరందించే వీలుందన్నారు. కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులను వదిలి వెళ్లారని, తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేదిలేదని భీష్మించుకుని కూర్చున్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఎల్.రాంరెడ్డి, పర్శయాద గిరి, రాంచంద్రం, పుల్లూరి మల్లయ్య, పాతూరి అంజిరెడ్డి, స్వామి, నారాయణరెడ్డి కీసరి రాములు తదితరులున్నారు.

కాలువలను పూర్తిచేయండి: ఎమ్మెల్యే

దుబ్బాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలో అసంపూర్తిగా వదిలేసిన మల్లన్నసాగర్ పంట కాలువలను సత్వరమే పూర్తిచేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ బుధవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని ఎమ్మెల్యే లేవనెత్తారు. నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు చిన్నచిన్న పనులు చేస్తే పూర్తి అవుతాయని, వెంటనే నిధులు మంజూరు చేసి ఇళ్లు పూర్తి చేయాలని కోరారు.

'తూప్రాన్'కు అన్నీ మంజూరీలే..!

కొత్త డివిజన్‌లో కార్యాలయాలు కలేనా - ఏర్పాటులో నిర్లక్ష్యం



అసంపూర్తిగా నిలిచిపోయిన సమీకృత కార్యాలయ భవనం

తూప్రాన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజనతో ఏర్పాటైన తూప్రాన్ డివిజన్‌పై పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. డివిజన్ ఏర్పాటు చేసి.. ఇక్కడ డివిజన్ స్థాయి కార్యాలయాలకు మంజూరు ఇచ్చినా అవి ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో 'మంజూరులు సరే.. పూర్తయ్యేది ఎన్నడో' అని స్థానికులు చర్చించుకుంటున్నారు. జిల్లాల పునర్విభజనలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న తూప్రాన్‌ను 2016లో రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో తూప్రాన్ ఉన్నప్పటికీ మెదక్ జిల్లా పరిధిలో చేర్చుతూ కొత్త డివిజన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొత్తగా కార్యాలయాలు మంజూరు చేస్తూన్నారే తప్ప.. వాటిని ఏర్పాటు చేయడం లేదు. ఏళ్లు గడిచిపోతున్నప్పటికీ వాటి ఏర్పాటుకు అడుగులు పడటం లేదు. అదిగో.. ఇదిగో అంటు కాలం వెళ్లదీస్తున్నారు.

డిగ్రీ కళాశాల..

2018లో జనవరి 17న తూప్రాన్‌లో నిర్మించిన 50 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆనాటి సీఎం కేసీఆర్ పట్టణానికి వరాల జల్లులు కురిపించారు. తూప్రాన్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద జూనియర్ కళాశాల సమీపంలో స్థలం కేటాయించారు. విద్యార్థులు ఏడాదికేడాది కొత్తగా డిగ్రీ కళాశాల వస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

క్రీడా స్టేడియం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కొనసాగిన సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఆరు స్టేడియంలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తూప్రాన్, మనోహరాబాద్ మండలాలో ఒక్కొక్క స్టేడియం కోటి వ్యయంతో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. సీఎం హోదాలో కేసీఆర్ ప్రకటించడంతో తూప్రాన్ పట్టణ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద సర్వేనంబరు 325లో ఏడు ఎకరాల భూమి కేటాయించి, మార్కింగ్ చేసి పెట్టారు. మూడేళ్ల క్రితం యువజన క్రీడాశాఖ అధికారి స్టేడియం నిర్మాణం చేసేందుకు ప్లాన్ సైతం సిద్ధం చేశారు.

ఎక్సైజ్ కార్యాలయం..

రెవెన్యూ డివిజన్ అయిన తూప్రాన్‌లో ఎక్సైజ్ కార్యాలయం లేకుండా పోయింది. గతంలో తూప్రాన్‌కు ఎక్సైజ్ కార్యాలయం మంజూరు చేసి ఎస్ఐని సైతం నియమించారు. కొద్దిరోజులు విధులు నిర్వహించిన ఎక్సైజ్ ఎస్ఐ పోస్టు, కార్యాలయం రద్దు చేశారు.

అగ్నిమాపక కేంద్రం..

రెవెన్యూ డివిజన్ కేంద్రానికి మూడేళ్ల క్రితం అగ్నిమాపక కేంద్రం మంజూరైంది. తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు పారిశ్రామిక ప్రాంతాలుగా అభివృద్ధి చెందడంతో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు అవశ్యకతను గుర్తించారు. ఇందుకోసం భూమిని సైతం రెవెన్యూ అధికారులు చూపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జూన్, జూలై మాసంలో ఆర్థికశాఖ అనుమతికి పంపించారు.

ముందుకు సాగని కోర్టు ఏర్పాటు..

పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడిషరీ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటుకు ఏళ్లు గడిచిపోతున్నాయి. 2022 మే తూప్రాన్‌కు మంజూరు చేయగా, 20న జిల్లా న్యాయాధికారి మారుతీదేవి భవనాలను పరిశీలించారు. 2023 అక్టోబరులో మంజూరు చేసిన 57 కోర్టుల్లో తూప్రాన్ పేరు లేకుండా పోయింది. మళ్లీ 2024 సెప్టెంబరులో తూప్రాన్‌కు కోర్టు మంజూరు చేయడంతో జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద భవనాలు పరిశీలించారు. నవంబరు 4న జీవో 127 జారీచేస్తు న్యాయమూర్తితో సహా 27 పోస్టులు ఫైనాన్స్ శాఖ అనుమతిస్తు ఆదేశాలు జారీ చేసింది.

ముందడుగు పడని అర్బన్ పీహెచ్‌సీ..

పట్టణానికి అర్బన్ పీహెచ్‌సీ మంజూరైనా ఏర్పాటు చేయకపోవడంతో రోగులు, గర్భిణిలు, ఏఎన్ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుతో తూప్రాన్ పీహెచ్‌సీని మనోహరాబాద్‌కు బదిలీ చేశారు. రాష్ట్రంలో 2023 ఆగస్టు 31న 24 అర్బన్ పీహెచ్‌సీలు మంజూరు చేయగా, అందులో తూప్రాన్ సైతం ఉంది. అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటుకు సర్వేనంబరు 325లో భూమిని సైతం కేటాయించారు.

పెద్ద చెరువు సుందరీకరణ..

పట్టణ పెద్దచెరువు సుందరీకరణ పనులు ప్రతిపాధనల్లోనే ఉండిపోయాయి. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు సుందరీకరణలాగే తూప్రాన్ పట్టణంలోని పెద్దచెరువును సుందరీకరణ చేసేందుకు నిర్ణయించారు. పర్యాటక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పలు పర్యాయాలు విచ్చేసి పెద్దచెరువు సుందరీకరణ చేసేందుకు అవసరమైన పనులు గుర్తించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో పెద్ద చెరువు కట్ట మీదకు వెళ్లేందుకు మత్తడి మీదుగా బ్రిడ్జి నిర్మాణం, చెరువు కట్టపై సైడ్ వాల్స్, కట్టకు వెనుకవైపు గ్రాస్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇందుకు రూ. 3.80 కోట్లతో చేసిన ప్రతిపాదనలు ఐదేళ్లుగా జాడే లేకుండా పోయింది. యేడాదిన్నర క్రితం ఏర్పాటు చేసిన బోటు జాడే లేకుండా పోయింది.


నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో ముగ్గుల పోటీలో అందుకున్న బహుమతులతో మహిళలు, నిర్వాహకులు


సిద్దిపేటలో చిన్నారులకు ఉచితంగా గాలిపటాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తొగుట: పెద్దమాసాన్‌పల్లిలో ముగ్గు వేస్తున్న యువతి


రాయపోల్:అనాజీపూర్‌లో ఎడ్లబండ్లతో ఊరేగింపు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు


మద్దూరు: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


సిద్దిపేటలో ఓ ఇంటి వాకిట్లో పాలు పొంగిస్తున్న దృశ్యం


బసవన్నతో చిన్నారి సంబురం

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామాలు, పట్టణాల్లో వేకువ జాము నుంచే వాకిళ్లలో అందమైన రంగవళ్లలను వేస్తూ యువతులు మురిసిపోయారు. ముగ్గులపై గొబ్బెమ్మలు పేర్చి, నవధాన్యాలతో అందంగా అలంకరించారు. ముగ్గు మధ్యలో మట్టిపాత్రను ఉంచి పాలను పొంగించారు. డూడూ బసవన్నలు ముంగిళ్ల ముందుకు వచ్చాయి. ఆలయాలు ప్రత్యేక పూజల సందర్భంగా భక్తుల సందడి నెలకొన్నది. మహిళలు ఇళ్లలో ప్రత్యేక పూజలు చేసి పిండివంటలను నైవేద్యంగా పెట్టి ఇంటిల్లిపాది ఆరగించారు. అనంతరం గాలిపటాలతో పిల్లలు, యువకుల కేరింతలతో సందడి వాతావరణం చోటుచేసుకున్నది. పలుచోట్ల చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు, క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. బుధవారం కనుమ రోజున రైతులు పశువులను కడిగి అందంగా అలంకరించారు. పలుచోట్ల ఎడ్లబండ్లతో ఊరేగింపు తీశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి)


చిన్నకోడూరులో ఓ ఇంటి వద్ద పూజలందుకుంటున్న బసవన్న

అర్హులైన లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందాలి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి జిల్లాస్థాయి సన్నాహక సమావేశం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు జిల్లా యంత్రాంగం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే అందించాలని సూచించారు. ముందుగా వీటికి క్షేత్రస్థాయిలో అవసరమైన బృందాల ఏర్పాటు ప్రక్రియ, ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఎంపిక చేసిన సిబ్బంది గ్రామాల్లో, మున్సిపాలిటీలలో ఫీల్డ్ వెరిఫికేషన్ అత్యంత పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని, ఆ తర్వాతే లబ్ధిదారుల ముసాయిదా జాబితాను తయారు చేయాలన్నారు. తర్వాత గ్రామాల్లో, మున్సిపాలిటీ లలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో సభలు నిర్వహించి పూర్తి సమాచారాన్ని కంప్యూటరీకరణ చేయాలని చెప్పారు. గణతంత్ర దినోత్సవం రోజున లబ్ధిదారులకు పత్రాల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియ గ్రామస్థాయిలో బృందాలకు పర్యవేక్షణ చేయాల్సిందిగా ఎంపీడీవో, తహసీల్దార్‌లకు ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, డీఆర్డీఏ జయదేవ్ ఆర్యా, ఇతర అధికారులు, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

● సిద్దిపేట టౌన్/గజ్వేల్/జగదేవ్‌పూర్/మద్దూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం అమలు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. బుధవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆహార భద్రత కార్డుల జారీ సంబంధించిన విధి విధానాల గురించి వివరించారు. అదేవిధంగా గజ్వేల్‌లోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గొల్కొండ నరసయ్య ఆధ్వర్యంలో వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక విషయమై సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయాలని జగదేవ్‌పూర్ మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్, ఎంపీడీవో యాదగిరి, జగదేవ్‌పూర్ మండల స్పెషలాఫీసర్ రాధిక సూచించారు. బుధవారం జగదేవ్‌పూర్, మద్దూరు మండల కేంద్రాల్లోని ప్రజాపరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సంక్షేమ పథకాలకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామాల్లో గ్రామ ప్రత్యేకాధికారుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్‌రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గ్రామంలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో 5 వ తరగతి నుంచి 9వ తరగతిలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శామలత పేర్కొన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ ఫిబ్రవరి 1వ తేదీ అని తెలిపారు. ఆసక్తిగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 23వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● హుస్నాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, ఆధార్ కార్డు ఫొటోలతో మీ సేవా కేంద్రంలో రూ. 100 రుసుం చెల్లించి ఫిబ్రవరి ఒకటవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి.. కుటుంబాన్ని పరామర్శించిన కేంద్రమంత్రి


కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బండి సంజయ్

హుస్నాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఆర్ఎస్ఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పూర్వ ప్రచారక్, బీజేపీ సీనియర్ నాయకులు చిట్టి గోపాల్‌రెడ్డి సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గోపాల్‌రెడ్డి అధ్యాపకుడిగా, జర్నలిస్టుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గోపాల్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం హుస్నాబాద్‌లో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్ శాఖలను నెలకొల్పి హిందు జాతీయవాదాన్ని పెంపొందించడంలో ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారని మంత్రి కొనియాడారు. అలాగే పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బొంగొని లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. కేంద్ర మంత్రి వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీ చేస్తా

హుస్నాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి తాను పోటీ చేయనున్నట్టు హైదరాబాద్ అమిగోస్ విద్యాసంస్థల చైర్మన్ అక్కన్నపేట మండలం తురకవాని కుంట గ్రామానికి చెందిన ముసుకు రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయమై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో పాటు మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్‌లో కలిశానని తెలిపారు.

ఉజ్జయినిలో భక్తిశ్రద్ధలతో మహా రుద్రయాగం

● మహాకాళేశ్వర స్వామికి అభిషేకం ● మహంకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు


మహాకాళేశ్వర ఆలయంలో వేద పఠనం చేస్తున్న పండితులు

జగదేవ్‌పూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని మహాకాళేశ్వరస్వామి సన్నిధిలో జిల్లాకు చెందిన పండితుడు ఆదరాసుపల్లి మధుసూదనశర్మ పర్యవేక్షణలో లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న మహా రుద్రయాగం బుధవారం 3వ రోజు కొనసాగింది. తెలంగాణ ప్రాంతంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన మహా రుద్ర యాగం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కాగా మంగళ, బుధవారాల్లో మహాకాళేశ్వర స్వామి అభిషేకం, మహంకాళీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. బుధవారం ప్రదోషకాల పూజలో భాగంగా రుద్ర వైశిష్ట్యములపై ఉపన్యాసం, స్వామివారికి నాద నీరాజన సేవ, భజన కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. ప్రతి రోజూ వేద పండితులచే వేద పఠనం, మహాన్యాసంతో పాటు మహాకాళేశ్వర స్వామికి అభిషేకం, రుద్ర హవనం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వేద పండితులు బ్రహ్మశ్రీ త్రిగుళ్ల సనాతనశర్మ, నెమ్మాని శంకరశర్మ, అప్పాల మాధవశర్మ, భైరవభట్ల అద్రిజ, భైరవభట్ల చక్రధర్, మదునూరి శ్రీపాదరామ్, ఆదరాసుపల్లి సుమేధ, అప్పాల భావానందశర్మ, వేలేటి భాస్కరశర్మ, సాయి చిన్మయి, కేశిరెడ్డి నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లిలో వైభవంగా మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం ఇంటింటా బోనాలతో మల్లికార్జున స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అగ్నిగుండాల ప్రవేశం కోసం భక్తులు పోటి పడ్డారు. ఈ ఉత్సవాల్లో గ్రామ మాజీ సర్పంచ్ దేవసాని సుశీల, మాజీ మండల పరిషత్ వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, ఆలయ కమిటీ సభ్యులు మార్క చంద్రయ్య, అనిల్‌గౌడ్, కానుగుల మోహన్, నర్సింహ్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, వెంకటస్వామి, భక్తులు పాల్గొన్నారు.


అగ్నిగుండాల ప్రవేశంతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఉదయ్‌పూర్‌లో వివాహిత అదృశ్యం


సుజాత

రాయపోల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలం ఉదయ్‌పూర్ గ్రామంలో వివాహిత అదృశ్యమైంది. బుధవారం ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయ్‌పూర్ గ్రామానికి చెందిన సొక్కం సుజాత-చంద్రం దంపతులు బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం మేడ్చల్ వలస వెళ్లారు. ఇటీవల ఉదయ్‌పూర్‌కి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన సుజాత అదృశ్యమైంది. ఆమె భర్త ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఏఎస్ఐ వివరించారు.

రోడ్డు నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి

● జిల్లాలో ముమ్మరంగా జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాలు

సిద్దిపేట రూరల్/చేర్యాల/చిన్నకోడూరు/నంగునూరు/కుకునూరుపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో పోలీసులు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రతపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం పలు మండలాల్లో ప్రజలు, యువత, ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై పోలీసులు వివరించారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో ప్రజలకు, వాహనదారులకు ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు నిబంధనల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు ద్విచక్ర వాహనం నడిపించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. చేర్యాల మండలకేంద్రంలోని అంగడిబజారులో ఆటోడ్రైవర్లు, వాహనదారులకు చేర్యాల సీఐ ఎల్. శ్రీను, ఎంవీఐ క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరేశ్, ఏఎస్ఐ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద వాహనదారులకు, యువకులకు ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. నంగునూరు మండలం రాజగోపాలపేట ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్, పోలీసు సిబ్బందితో కలిసి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏఎస్ఐ జగదీశ్వర్ సిబ్బందితో కలిసి ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.


సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులోవాహనదారులకు అవగాహ న కల్పిస్తున్న రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి


చేర్యాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను, ఎంవీఐ క్రిస్టోఫర్

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కొండపాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసనగండ్ల గ్రామం రైతు దేవిరెడ్డి రామ్‌రెడ్డికి చెందిన పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బుధవారం ఎప్పటిలాగే మేతకు వెళ్తున్న గేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

'ప్రయాస -2024' రెండోదశ ఫైనల్ రౌండ్‌కు జడ్పీస్కూల్ విద్యార్థిని ప్రాజెక్టు


వైష్ణవితో గైడ్ టీచర్ చిన్నబ్రహ్మయ్య

మర్కుక్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్‌సీఈఆర్‌టీ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో వినూత్నమైన ప్రాజెక్ట్ ఎంపికలో భాగంగా ఆన్లైన్‌లో పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రయాస్-2024లో ఎన్నికైన ఏకైక ప్రాజెక్టు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం దామరకుంట జడ్పీ ఉన్నత పాఠశాలది కావడం గమనార్హం. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని లింగ వైష్ణవి, గైడ్ టీచర్ వై. చిన్నబ్రహ్మయ్య భౌతికశాస్త్రం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రాజెక్టు ప్రయాస రెండో దశ(ఫైనల్‌రౌండ్)కు ఎన్నిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పి. బాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. చివరి దశలో కూడా ఉత్తమ ప్రదర్శన చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ఏఎంసీ డైరెక్టర్ నర్సింహ్మారెడ్డి, గ్రామ యువత ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు అతిథిగా హాజరైన నర్సారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విజేతలకు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్ అందజేశారు.

చేర్యాలలో స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు


చేర్యాలలో క్రికెట్ టోర్నీ విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చేర్యాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మకర, కనుమ సంక్రాంతి పండుగ వేడుకలను చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు అత్యంత ఆనందోత్సాహాల నడుమ సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణంలోని స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించగా, రమాఫణీంద్ర టీం విజయం సాధించగా క్లబ్ అధ్యక్షుడు కోణం నర్సింహులు కప్, నగదు బహుమతిని ప్రదానం చేశారు. చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో చుంచనకోట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలి


కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్ఐ రాజు

చేర్యాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని కొమురవెల్లి ఎస్ఐ రాజు పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రీడోత్సవాలను బుధవారం ఎస్ఐ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు క్రీడాకారుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో చేర్యాల మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి, మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి, నాయకులు, కొమ్మూరి యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిద్దిపేట రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసంతో పాటు శరీర దారుఢ్యానికి దోహదపడుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి అధ్వర్యంలో గ్రామ యువకులకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, సమయస్ఫూర్తి ఉంటేనే విజయం వరిస్తుందని సూచించారు. క్రీడల్లో గెలుపొందిన యువకులకు బహుమతులను ప్రదానం చేశారు.

యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి


ఎల్లారెడ్డిపేటలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న పోచయ్య

తొగుట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని తొగుట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో యువకులకు వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.